సీఎం రిలీఫ్‌ఫండ్‌తో పేదలకు లబ్ధి: ఎమ్మెల్యే


సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌వోసీని బాధితులకు అందజేస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎం సహాయనిధి ఎంతగానో దోహదం చేస్తుందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని వివేకానందనగర్‌లో నివసించే రామకృష్ణ భార్య చంద్రవంతి కిడ్నీ సంబంధిత వ్యాధితో కొంతకాలంగా ఇబ్బందిపడుతుంది. వైద్యులు ఆపరేషన్ చేయాలని సూచించారు. అయితే ఆర్థిక పరిస్థితి బాగాలేక వైద్య సహాయం కోసం ఎమ్మెల్యేని సంప్రదించారు. దీంతో సీఎం సహాయ నిధి ద్వారా ఆపరేషన్ చేయించేందుకు హామీనిచ్చారు. ఈ క్రమంలో సీఎం సహాయ నిధి ద్వారా ఆపరేషన్ ఖర్చుల నిమిత్తం రూ.1.50లక్షల ఎల్‌వోసీని మంజూరు చేయించారు. ఎల్‌వోసి చెక్కును ఆదివారం రామకృష్ణకు ఆయన అందజేశారు.


మేయర్ పారిజాతారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కాలనీల ప్రతినిధులు

కాలనీల్లో సమస్యల పరిష్కారానికి కృషి: మేయర్

సరూర్‌నగర్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ 26వ డివిజన్ పరిధిలో గల న్యూతిరుమలానగర్, హనుమాన్‌నగర్, అరవింద్‌నగర్ కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయా కాలనీల ప్రతినిధులు యూత్ కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మేయర్‌ను ఆమె నివాసంలో కలిసి స్థానిక సమస్యలపై వినతి పత్రం అందజేశారు. తమ కాలనీల్లో రోడ్లు సరిగా లేవని, వీధి లైట్లు అరకొరగానే ఉన్నాయని, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదని మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. కాగా అధికారులతో చర్చించి ఆయా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ఆమె వారికి హామీ ఇచ్చారు.

డ్రైనేజీని పరిశీలించిన కార్పొరేటర్


మారుతీనగర్ డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

కొత్తపేట, జూన్ 9(ఆంధ్రజ్యోతి): కొత్తపేట కాలనీల్లో డ్రైనేజీ సమస్యలను పరిష్కరించపోతే జలమండలిని ముట్టడిస్తామని కార్పొరేటర్ పవన్‌కుమార్ హెచ్చరించారు. డివిజన్‌లోని కాలనీల్లో పాత రోజుల్లో ఏర్పాటు చేసిన పైప్‌లైన్లతో సమస్యలు తలెత్తుతున్నాయని వాటిని మార్చా లని పలు మార్లు విన్నవించినా తగిన స్పందన కానరావడంలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన మారుతీనగర్‌లో పర్యటించారు. మారుతీనగర్ జైన్ మందిర్ దారిలో మ్యాన్‌హోల్ నుంచి మురుగు నీరు దారిపై ప్రవహిస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు మల్లేష్, ప్రతినిధులు శ్రీనివాస్, సురేష్, మల్లికార్జున్, అల్వాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎంపీ ఈటలను సన్మానించిన కార్పొరేటర్


ఎంపీ ఈటల రాజేందర్‌ను సన్మానిస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి తదితరులు

చంపాపేట, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. అదేవిధంగా ఎంపీలు జి. కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్‌ను ఢిల్లీలో వారి నివాసంలో కార్పొరేటర్ కలుసుకొని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, లచ్చిరెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, కొంతం దీపిక, నాయకులు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

భిక్షపతికి 'విశ్వ సేవారత్న' అవార్డు ప్రదానం


భిక్షపతిచారికి అవార్డు అందజేస్తున్న మాజీ స్పీకర్ మధుసూదనాచారి

సరూర్‌నగర్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ ధర్మపీఠం, విశ్వ బ్రాహ్మణ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ప్రతియేటా వివిధ రంగాల్లో సేవందించిన విశ్వ బ్రాహ్మణ, విశ్వకర్మలకు విశిష్ట సేవా పురస్కారాలు అందజేస్తుంటారు. ఇందులో భాగంగా ఈ ఏడాది సదరు అవార్డులకు ఎంపిక చేసిన వారిలో మీర్‌పేట్ మునిసిపల్ కార్పొరేటర్ పసునూరి భిక్షపతిచారికి స్థానం కల్పించింది. ఈ క్రమంలో శనివారం రాత్రి నగరంలోని నారాయణగూడలో గల బొజ్జ జనసేన హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన మాజీ స్పీకర్ ఎస్.మధుసూదనాచారి కార్పొరేటర్ చారికి 'విశ్వ సేవా రత్న' అవార్డు అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విశ్వ బ్రాహ్మణ, విశ్వకర్మ తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు వేములవాడ మదన్‌మోహనాచారి, రంగారెడ్డి జిల్లా కమిటీ అధ్యక్షుడు పులిగిల్ల శ్రీనివాస్‌చారి, శివానందచారి, బ్రహ్మచారి, యాదగిరిచారి, దయానందచారి, వెంకట్‌చారి, సుదర్శన్‌చారి పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వం

వనస్థలిపురం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు, తాము ఎంచుకున్న రంగంలో ఉన్నత స్థానాలకు వెళ్లడానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడుతాయని క్రికెట్ కోచ్ శివాజీ పేర్కొన్నారు. మన్సూరాబాద్‌లో శివాజీ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ క్యాంప్ 2024 ఆదివారం ముగిసాయి. ఈ సందర్భంగా క్యాంప్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అనంతరం కోచ్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు చిన్నతనం నుంచే క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకుని రాణించాలన్నారు. క్రీడలు మానసిక ప్రశాంతతతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

- ముగ్గురు అరెస్ట్

వనస్థలిపురం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తులను వనస్థలిపురం పోలీస్‌లు ఆదివారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..వనస్థలిపురం రైతుబజార్ సమీపంలోని డబుల్ బెడ్రూంలో నివాసముంటున్న పవార్ నెహ్రూ(28) కొంత కాలంగా ఒక ముఠాగా ఏర్పడి అక్రమంగా రేషన్ బియ్యం తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ హోటల్స్, ఇతర టిఫిన్ సెంటర్లతో పాటు ఇతర రాష్ట్రాలకు అధిక ధరలకు విక్రయిస్తు సొమ్ము చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధి తుర్కయంజాల్‌లోని కమ్మగూడ శివాజీనగర్‌లో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వచేసి ఇతర రాష్ట్రానికి చెందిన డీసీఎం(డబ్ల్యూబీ65ఇ2770)లో పది టన్నుల రేషన్ బియ్యాన్ని లోడ్ చేసి విక్రయిస్తున్నాడని పోలీసులకు విశ్వాసనీయ సమాచారం అందింది. దీంతో వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ గోదాంపై పోలీసులు దాడి చేసి ముగ్గురు వనస్థలిపురానికి చెందిన పవార్ నెహ్రూ, పశ్చిమ బెంగాల్‌కు చెందిన చౌదరి పారా, సువాన్ సేఖ్ అనే వ్యక్తులను అదుపులోకి తీసుకుని రేషన్ బియ్యంతో పాటు, డీసీఎంను సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశాంతంగా గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష

చాదర్‌ఘాట్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలు మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని 8కేంద్రాల్లో ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. దిల్‌సుఖ్‌నగర్‌లోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల, సిద్ధార్థ డిగ్రీ కళాశాల, ప్రగతి మహిళా డిగ్రీ కళాశాల, అనిబిసెంట్ మహిళా డిగ్రీ కళాశాల, మలక్‌పేట సలీంనగర్‌లోని సెయింట్ డామినిక్స్ హైస్కూల్, దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయి చైతన్య జూనియర్ కళాశాల, సాకేత డిగ్రీ కళాశాల, నోబుల్ డిగ్రీ కళాశాలల్లో పరీక్షలు జరిగాయి. ఈసందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా మలక్‌పేట పోలీసులు కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.


ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పరీక్షలను పరిశీలించి వస్తున్న కలెక్టర్ శశాంక తదితరులు


పరీక్ష రాసేందుకు పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న దివ్యాంగుడు


సమయం కావడంతో పరీక్షా కేంద్రంలోకి పరుగులు తీస్తున్న అభ్యర్థులు

అబ్దుల్లాపూర్‌మెట్‌లో..

అబ్దుల్లాపూర్‌మెట్: హైదరాబాద్ శివారు అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలకు అధికారులు 15 పరీక్ష సెంటర్లను ఏర్పాటు చేశారు. అబ్దుల్లాపూర్‌మెట్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సెంటర్‌ను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక పరిశీలించారు. ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్షలు జరిగాయి. ఉదయం 10గంటల లోపే అందరిని హాల్‌లోకి పంపించారు. పరీక్షలు రాసే వారిని క్షుణ్నంగా తనిఖీలు చేశారు. హాల్ టికెట్‌తో పాటు గుర్తింపు కార్డులను పరిశీలించిన తర్వాతనే లోపలికి పంపించారు.


స్ఫూర్తి కాలేజీలో ఏర్పాటు చేసిన కేంద్రంలోకి వెళ్లడానికి క్యూలో నిల్చున్న అభ్యర్థులు

హయత్‌నగర్: హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 11 సెంటర్లలో పరీక్షలు జరిగాయి. ఉదయం 10.30 గంటలకు పరీక్ష ఉండడంతో అభ్యర్థులు 9గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ఉదయం 9.30 గంటలకే బయోమెట్రిక్ హాజరు తీసుకుని అభ్యర్థులను పరీక్ష హాల్‌లోనికి అనుమతించారు.

మీర్‌పేట్‌లో నిమిషం ఆలస్యంగా వచ్చిన నలుగురు అభ్యర్థులకు నో ఎంట్రీ

సరూర్‌నగర్: గ్రూప్-1 పరీక్షకు మీర్‌పేట్ పరిధిలోని టీకేఆర్ ఇంజనీరింగ్ కాలేజీ, స్ఫూర్తి ఇంజనీరింగ్ కాలేజీ, టీఆర్ఆర్ పాలిటెక్నిక్ కాలేజీ, న్యూమాస్టర్ మైండ్స్ జూనియర్ కాలేజీల్లో కలిపి మొత్తం ఎనిమిది సెంటర్లు ఏర్పాటు చేశారు. నలుగురు అభ్యర్థులు టీకేఆర్ కాలేజీలో ఏర్పాటు చేసిన సెంటర్‌కు నిమిషం ఆలస్యంగా రావడంతో అనుమతించలేదు. సదరు అభ్యర్థులు కాసేపు అధికారులను బ్రతిమిలాడినా లోపలికి అనుమతించకపోవడంతో నిరాశగా వెనుదిరిగారు. మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ ఆధ్వర్యంలో ఆయా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషి: సబితారెడ్డి


ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ కార్యవర్గంతో ఎమ్మెల్యే సబితారెడ్డి

సరూర్‌నగర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఆర్య వైశ్యుల సంక్షేమానికి కృషి చేస్తానని, వారి కోసం సంక్షేమ నిధి ఏర్పాటు చేసేలా ప్రభుత్వంతో చర్చిస్తానని మహేశ్వరం ఎమ్మెల్యే పీ.సబితారెడ్డి అన్నారు. ఆర్యవైశ్య సంఘం మీర్‌పేట్ కార్పొరేషన్ శాఖ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం ఆదివారం జిల్లెలగూడలోని ఎస్‌వైఆర్ గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సబితారెడ్డి మాట్లాడుతూ గతంలోని కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి చర్యలు తీసుకున్నదని, ప్రస్తుత ప్రభుత్వం సైతం ఆ దిశలో కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ బొగ్గారపు రాజేందర్‌గుప్తా, గణేశ్‌గుప్తా, రవికుమార్ గుప్తా, లక్ష్మయ్యగుప్తా, వెంకటేశంగుప్తా, కవిత, మీర్‌పేట్ నూతన కమిటీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి రవీందర్‌గుప్తా, కోశాధికారి శ్యాంప్రసాద్‌గుప్తా, శుభకుమార్‌గుప్తా, నాగశంకర్ గుప్తా, రాజుగుప్తా, లక్ష్మణ్‌గుప్తా, సురేశ్‌కుమార్‌గుప్తా, శ్రీనివాస్‌గుప్తా, పీఎస్ఆర్‌సీ పాల్గొన్నారు.

కవయిత్రి మొల్ల విగ్రహం పేరుతో ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం..?

- అక్రమంగా నిర్మించిన దిమ్మెను కూల్చివేసిన రెవెన్యూ అధికారులు

హయత్‌నగర్: బాగ్ హయత్‌నగర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 159లోని విలువైన ప్రభుత్వ భూమిలో కొందరు వ్యక్తులు శనివారం రాత్రి కవయిత్రి మొల్ల విగ్రహం ఏర్పాటు చేశారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రికి రాత్రే దిమ్మెను నిర్మించి దానిపైన విగ్రహం ఏర్పాటు చేశారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న హయత్‌నగర్ మండల రెవెన్యూ అధికారులు ఆదివారం ఉదయం సంఘటనా స్థలానికి వెళ్లి అక్రమంగా నిర్మించిన దిమ్మెను కూల్చివేసి విగ్రహాన్ని తరలించారు. ఇప్పటికే సదరు స్థలాన్ని పద్మశ్రీ అవార్డు గ్రహీత కిన్నెర మొగులయ్యకు ఇచ్చేందుకు పరిశీలించారు. ప్రభుత్వ భూమి 159లో ప్రభుత్వ ఎక్సైజ్ కార్యాలయానికి, పాఠశాలకు కేటాయించారు. అది పోను మిగిలిన స్థలాన్ని దొడ్డి దారిలో ఆక్రమించేందుకు తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయి.

తవ్వేశారు.. వదిలేశారు

(1వ పేజీ తరువాయి)


పోచమ్మ ఆలయం ఎదుట పైప్‌లైన్ కోసం తవ్విన గుంత

చెల్లించిన అనంతరం రోడ్డు తవ్వేందుకు అనుమతినిస్తారు. పను లు పూర్తయిన అనంతరం జీహెచ్‌ఎంసీ పునరుద్ధరణ పనులు చేపడుతుంది. ఈ విషయంలో వాటర్‌బోర్డుకు మినహాయింపునిచ్చారు. ఇంజనీరింగ్ వ్యవస్థ ఆ విభాగంలో కూడా ఉండడంతో కొద్ది మేర రోడ్డు తవ్వే పనులకు సంబంధించి పునరుద్ధరణ పనులు చేసే బాధ్యత బోర్డుకు అప్పగిస్తూ గతంలో నిర్ణయం తీసుకున్నారు. అయితే, చాలా ప్రాంతాల్లో బోర్డు అధికారులు రోడ్డు పునరుద్ధరణ పనులు చేపట్టడం లేదు. లీకేజీల అరెస్టు, పైపులైన్ల మార్పు కోసం రహదారులు తవ్వి వదిలేస్తున్నారు. సకాలంలో పునరుద్ధరణ పనులు చేయని పక్షంలో సంబంధిత అధికారుల నుంచి జీహెచ్‌ఎంసీ వివరణ కోరే అవకాశముంది. అయినా బల్దియా బాధ్యత విస్మరిస్తోంది.

ఎన్నికల కోడ్ వల్లే : జీహెచ్‌ఎంసీ అధికారి..

ఎన్నికల కోడ్ ఉండడం వల్లే పనుల్లో కొంత జాప్యం జరిగింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముగిసిన నేపథ్యంలో రోడ్ల నిర్మాణం, పునరుద్ధరణ పనులు వేగవంతం చేస్తామని జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారొకరు చెప్పారు. కోడ్ అమలులో ఉన్నప్పుడు కొత్త రోడ్ల నిర్మాణం చేపట్టవద్దు.. మరమ్మతు, నిర్వహణ పనులుచేసే అవకాశమున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.


గ్రేటర్ విద్యుత్ వ్యవస్థ మరింత బలోపేతం

- స్కాడా పరిధిలోని లైన్స్‌విభాగం ఆపరేషన్ విభాగం పరిధిలోకి..
- రెండు, మూడు రోజుల్లో తుది నివేదిక

హైదరాబాద్ సిటీ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ పరిధిలో విద్యుత్ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్) ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నది. మెట్రోజోన్ పరిధిలో విద్యుత్‌లైన్ల విభాగాన్ని ఆపరేషన్ వింగ్ పరిధిలోకి తీసుకువచ్చే దిశగా డిస్కం కసరత్తు ప్రారంభించింది. గ్రేటర్‌జోన్‌లో విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటూ వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై డిస్కం ఓ కమిటీని నియమించింది. ప్రస్తుతం స్కాడా ఎస్‌ఈ పరిధిలో పనిచేస్తున్న లైన్స్ విభాగం డీఈలు ఆపరేషన్స్ ఎస్‌ఈల పరిధిలోకి తీసుకువచ్చే దిశగా కమిటీ ప్రాథమికంగా సూచించింది. ఇద్దరు సీజీఎంలు, ముగ్గురు ఎస్‌ఈలతో ఏర్పాటు చేసిన ఈ కమిటీ టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూకీకి ఇప్పటికే ఓ నివేదిక సమర్పించింది. ఆ నివేదికను పరిశీలించిన సీఎండీ కమిటీకి పలు సూచనలు చేయడంతో పాటు తుది నివేదికను సిద్ధం చేయాలని ఆదేశించారు. రెండు, మూడు రోజుల్లో మెట్రోజోన్‌లో చేపట్టబోయే మార్పులు, జోన్లు, సర్కిళ్ల పునర్విభజనపై పూర్తి స్థాయిలో స్పష్టత వస్తుందని ఉన్నతాధికారులు చెబుతున్నారు.

కూచిపూడి రంగప్రవేశం




ప్రముఖ దంత వైద్యులు ఎం.ఎస్ గౌడ్ మనుమరాళ్లు, కీర్తి, వికాస్‌గౌడ్ దంపతుల కూతుళ్లు త్రిఖగౌడ్, మిష్కగౌడ్ ఆదివారం మాదాపూర్‌లోని శిల్పకళా వేదికగా కూచిపూడి రంగప్రవేశం చేశారు. నృత్య ప్రదర్శన ఆద్యంతం సభికులను ఆకట్టుకుంది. కూచిపూడి నాట్యగురువు జ్యోతిరెడ్డి పర్యవేక్షణలో గౌడ సిస్టర్స్ రంగ ప్రవేశానికి ప్రముఖ సినీనటుడు సుమన్, విశ్రాంత ఐఏఎస్‌లు కాకి మాధవరావు, కేవీ రమణాచారి, తెలంగాణ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, విశ్రాంత న్యాయమూర్తి ఈశ్వరయ్య, పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ సాయిబాబాగౌడ్, భారతీయం సత్యవాణి, నృత్య విమర్శకుడు జీవీ అన్నారావు తదితరులు హాజరయ్యారు.

నగరంతో కిషన్‌రెడ్డి మమేకం

(1వ పేజీ తరువాయి)

రోడ్డు షోలు విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించారన్నారు.

అంబర్‌పేటతో అనుబంధం

గంగాపురం కిషన్‌రెడ్డి కేంద్ర క్యాబినెట్ మంత్రి స్థాయికి ఎదిగినా అంబర్‌పేట అసెంబ్లీ నియోజకవర్గంతో విడదీయరాని అనుబంధం ఉంది. పూర్వ హిమాయత్‌నగర్‌లో ఒకసారి, పునర్విభజనలో అంబర్‌పేటగా ఏర్పడిన తర్వాత రెండుసార్లు ఆయన విజయం సాధించారు. తర్వాత ఆయన సికింద్రాబాద్ ఎంపీగా రెండుసార్లు విజయం సాధించారు. రెండుసార్లు అంబర్‌పేటలో అత్యధిక మెజార్టీ ఓట్లు ఆయనకు దక్కాయి. ఎంపీగా ఆయన విజయం సాధించడంలో ఈ నియోజకవర్గ ప్రజలు ప్రధాన భూమిక పోషించారు. అందుకే కిషన్‌రెడ్డి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలలో అంబర్‌పేటకు అధిక ప్రాధాన్యమిస్తూ కృతజ్ఞతాపూర్వకంగా ఉంటున్నారని స్థానిక పార్టీ నేతలు పేర్కొంటున్నారు.

నగరాభివృద్ధి బాటలో..

నగర అభివృద్ధిలో కిషన్‌రెడ్డి కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయాన్ని ఆయన 'రిపోర్ట్ టు ద పీపుల్ ప్రజెంటేషన్' (ప్రజలకు నివేదిన)లో స్పష్టం చేశారని నాయకులు చెబుతున్నారు. హైదరాబాద్ చుట్టూ రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణానికి రూ. 26,000 కోట్లు కేటాయింపు, మెట్రోకు రూ.1204 కోట్ల నిధులు కేటాయించడంలో కిషన్‌రెడ్డి కృషి ఉందంటున్నారు. వచ్చే ఏడాది నాటికి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను శంషాబాద్ విమానాశ్రయం మాదిరిగా ఆధునికీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.715 కోట్లతో పనులు ప్రారంభించిందని, అది పూర్తయితే నగరానికే తలమానికంగా స్టేషన్ నిలవనున్నదని చెబుతున్నారు. అలాగే హైదరాబాద్‌లో 1000 లీటర్ల సామర్థ్యం గల ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు, ఓయూ క్యాంపస్ ఆర్ట్స్ కాలేజీలో డైనమిక్ లేజర్ షో, సైఫాబాద్‌లో మింట్ మ్యూజియం ఏర్పాటు, గోల్కొండ కోటల చరిత్ర తెలిపేలా సౌండ్ అండ్ లైట్ షోలను అందుబాటులోకి తీసుకురావడం కీలకమంటున్నారు. కాచిగూడ, నాంపల్లి, బేగంపేట ఆధునికీకరణ, ఎంఎంటీఎస్ ఫేజ్-11 పనులను పూర్తి, సనత్‌నగర్‌లో నిర్మిస్తున్న ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీ, ఆస్పత్రి, ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్‌నెస్‌సెంటర్లు ద్వారా నగరంలోని బస్తీ దవాఖానాల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటు చేయడంలో ఆయన పాత్ర చాలా ఉందంటున్నారు. ఉస్మానియా, గోల్కొండ కోట, చార్మినార్, ట్యాంక్‌బండ్ వైభవాన్ని ప్రతిబింబించేలా ఇల్యూమినేషన్, సౌండ్ అండ్ లైట్ షోలు అందుబాటులోకి తెచ్చినట్లు చెబుతున్నారు.

సికింద్రాబాద్‌లో గెలిస్తే.. కేంద్రంలో బెర్త్ పక్కా

(1వ పేజీ తరువాయి)

గెలుపొందిన శివశంకర్ 1980లో ఇందిరాగాంధీ ప్రభుత్వంలో కీలకమైన న్యాయ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 1984లో సికింద్రాబాద్ నుంచి గెలిచిన టంగుటూరి అంజయ్య రాజీవ్‌గాంధీ మంత్రి వర్గంలో కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా పనిచేశారు. ఇదే పార్లమెంట్ స్థానం నుంచి గెలుపొందిన బండారు దత్తాత్రేయ 1998 నుంచి 1999 వరకు వాజ్‌పేయి మంత్రి వర్గంలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ సహాయ మంత్రిగా.. 1999నుంచి 2001 వరకు వాజపేయి మంత్రి వర్గంలో రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. 2003లో బండారు అర్బన్ డెవలప్‌మెంట్ పోర్ట్ పోలియో ఇచ్చారు. 2014లో నరేంద్రమోదీ మంత్రి వర్గంలో కార్మిక, ఉపాధి శాఖ మంత్రిగా దత్తాత్రేయ పనిచేశారు. ఆ తర్వాత 2019, 2024లో కిషన్‌రెడ్డి సికింద్రాబాద్ నుంచి గెలుపొందారు. 2019లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా, ఆ తర్వాత సాంస్కృతిక, పర్యాటక శాఖ, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ క్యాబినెట్ మంత్రిగా పనిచేశారు. మళ్లీ ఇప్పుడు తాజాగా జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచిన కిషన్‌రెడ్డికి కేంద్ర మంత్రి పదవి లభించింది.

వ్యాపారిపై దాడి, కిడ్నాప్

- ఆర్థిక లావాదేవీల వివాదం
- కొన్ని గంటల్లోనే అడ్డాకులలో పట్టుకున్న పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రమణగౌడ్, సీఐ హరికృష్ణారెడ్డి

నార్సింగ్, : నగరానికి చెందిన గోల్డ్, ఎలక్ట్రానిక్ వ్యాపారం చేసే వ్యక్తిని ఆర్థిక లావాదేవీల కారణంగా కర్నూల్‌కు చెందిన వారు దాడి చేసి మరీ కిడ్నాప్ చేశారు. నార్సింగ్ పోలీసులు కొన్ని గంటల వ్యవధిలో నిందితులను మహబూబ్‌నగర్ పోలీసుల సహాయంతో పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను నార్సింగ్ ఏసీపీ రమణగౌడ్, ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి ఆదివారం సాయంత్రం వెల్లడించారు. హైదర్షాకోట్ పోర్ట్‌వ్యూ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే శేషువర్ధన్‌రెడ్డి (37) బంగారం, ఎలక్ట్రానిక్ వస్తువుల వ్యాపారం చేస్తుంటాడు. ఈయనకు కర్నూల్ నందికొట్కూరుకు చెందిన అందె క్రాంతి కుమార్(36), పి.సందీప్(36)తో ఆర్థిక లావాదేవీలు ఉన్నాయి. శనివారం రాత్రి 9.30 గంటల సమయంలో శేషువర్ధన్‌రెడ్డి తన బిజినెస్ పార్ట్‌నర్ సుష్మితకు చెందిన మారుతీ ఎస్‌క్రాస్ కారు(టీఎస్07హెచ్‌ఏ1221)లో వెళ్తుండగా నార్సింగ్ రోటరీ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు ఆపారు. శేషువర్ధన్‌రెడ్డిపై దాడి చేసి మరో కారులో ఎక్కించుకొని వెళ్తుండగా నార్సింగ్ పోలీసులకు సమాచారం అందింది. వారు వచ్చి కారును తనిఖీ చేస్తుండగా రాత్రి 10 గంటల ప్రాంతంలో శేషువర్ధన్‌రెడ్డి భార్య అరుణకు ఫోన్ వచ్చింది. ఆమె నార్సింగ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. కిడ్నాపర్లు కారులో శేషువర్ధన్‌రెడ్డిని తీసుకొని కర్నూల్ వైపు వెళ్తున్నట్లు నార్సింగ్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో మహబూబ్‌నగర్ పోలీసులను అలర్ట్ చేయగా, వారు చెక్‌పోస్టుల వద్ద నిఘా పెట్టారు. అడ్డాకుల టోల్‌గేట్ వద్ద కిడ్నాపర్లు మహబూబ్‌నగర్ పోలీసులకు చిక్కారు. గతంలో వీరు ఏసీల బిజినెస్ కూడా కలిసి చేశారని పోలీసులు గుర్తించారు. శేషువర్ధన్‌రెడ్డిని సురక్షితంగా అడ్డాకుల పోలీసుల సహాయంతో రక్షించగలిగామని నార్సింగ్ ఏసీపీ రమణగౌడ్, ఇన్ స్పెక్టర్ హరికృష్ణారెడ్డి తెలిపారు. వ్యాపార లావాదేవీలను న్యాయపరంగా కోర్టు నుంచి పరిష్కరించుకోవాలని పోలీసులు సూచించారు.

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తి మృతి

చాదర్‌ఘాట్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): వేగంగా వెళ్తున్న ద్విచక్రవాహనం రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి అక్కడి కక్కడే మృతి చెందాడు. చాదర్‌ఘాట్ ఎస్‌ఐ రవిరాజ్ తెలిపిన వివరాల ప్రకారం మలక్‌పేట అక్షయ హోటల్ సమీపంలో వ్యక్తి రోడ్డు దాటుతున్నాడు. ఇంతలోనే వేగంగా వెళ్తున్న డియో ద్విచక్ర వాహనం (టీఎస్ 09 ఎఫ్ఆర్ 2497) ఢీకొట్టింది. ఈసంఘటనలో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. రోడ్డు దాటుతున్న వ్యక్తి తీవ్ర గాయాలతో అక్కడి కక్కడే మృతి చెందాడని పోలీసులు తెలిపారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడు గుర్తు తెలియని వ్యక్తిగా పోలీసులు భావిస్తున్నారు. మృతుడికి సంబంధించిన వారు చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కొత్తగా బస్ రూట్లు.. నెలవారీ పాస్‌లు.!

- ఆదాయం పెంచుకోవడమే లక్ష్యంగా ఆర్టీసీ చర్యలు
- టీజీఎస్ఆర్టీసీగా బస్‌పాస్ వెబ్‌సైట్ మార్పు



హైదరాబాద్ : గ్రేటర్‌లో కొత్త బస్‌రూట్లు అందుబాటులోకి తీసుకురావడంతోపాటు ఆదా యం పెంచుకునేందుకు ఏసీ బస్సుల్లో రూట్ బస్‌పాస్‌లు, చార్జీలు తగ్గించి నెలవారీ పాస్‌లను గ్రేటర్ ఆర్టీసీ అందుబాటులోకి తెచ్చింది. ఏసీ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ పెంచి అదనపు ఆదాయం తెచ్చేకునే దిశగా ప్రణాళికలు సిద్ధం చేసింది. అందులో భాగంగా పుష్పక్ ఏసీ బస్సుల్లో మొదటిసారిగా రూట్ పాస్‌లను అందుబాటులోకి తెచ్చింది. శంషాబాద్-ఎయిర్‌పోర్ట్‌లో శంషాబాద్, ఆరాంఘర్, బాలాపూర్, గచ్చిబౌలి నుంచి రాజీవ్‌గాంధీ ఎయిర్ పోర్టుకు ప్రయాణించేవారి కోసం రూట్‌పాస్‌లను అందుబాటులోకి తెచ్చారు. అదే తరహాలో గ్రీన్‌మెట్రో లగ్జరీ ఏసీ బస్సుల్లో రూ. 1,900కే నెలవారీ బస్‌పాస్ ప్రవేశపెట్టారు. ఈ పాస్ ధర మే వరకు రూ.2,530 ఉండగా రూ.630 తగ్గించి బస్‌పాస్‌ల సంఖ్య పెంచే దిశగా ఆర్టీసీ చర్యలు చేపట్టింది. విద్యార్థుల బస్‌పాస్ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఫార్వర్డ్ చేసే http://mis.tsrtcpass.in A¯óþ Ðõþ»Œý-òÜOsŒý Mæü*y‘ http://mis.tgsrtc-pass.comగా మార్చినట్లు గ్రేటర్ ఈడీ వెంకటేశ్వర్లు తెలిపారు.

రామోజీరావుకు పీఆర్ఎస్ఐ సంతాపం

హైదరాబాద్ సిటీ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): యాభై ఏళ్ల పాటు అప్రతిహతంగా నాణ్యమైన సమాచారం ప్రసారం చేసిన మీడియా దిగ్గజం చెరుకూరి రామోజీరావు మృతికి పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా(పీఆర్ఎస్ఐ) హైదరాబాద్ చాప్టర్ ప్రతినిధులు సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పీఆర్ఎస్ఐ చైర్మన్ ఎస్.రాము మాట్లాడుతూ ఆధునిక జర్నలిజంలో ఎన్నో మార్పులకు రామోజీరావు శ్రీకారం చుట్టారని తెలిపారు. కార్యదర్శి కంభంపాటి యాదగిరి మాట్లాడుతూ రామోజీ తెలుగు జాతికి చేసిన సేవలు మరువలేమని పేర్కొన్నారు. వాకిటి మధు, శ్రీనివాసరావు, కృష్ణ బాజీ, రాజేష్, మోహన్‌రావు, సుబ్బారావు తదితరులు రామోజీరావుతో సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు.

పార్ట్‌టైమ్ జాబ్ పేరుతో దోపిడీ

- రూ. 14.5 లక్షలు దోచేసిన సైబర్ నేరగాళ్లు
- లింక్‌లు పంపి లైక్, సబ్‌స్క్రైబ్ చేస్తే చాలంటూ బురిడీ

హైదరాబాద్ సిటీ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పార్ట్‌టైమ్ జాబ్ ఆఫర్ పేరుతో సైబర్ నేరగాళ్లు నగరానికి చెందిన మహిళ నుంచి రూ. 14.5 లక్షలు దోచేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్‌కు చెందిన మహిళకు ఇటీవల టెలిగ్రామ్ యాప్‌లో పార్ట్‌టైమ్ జాబ్స్ పేరుతో ఒక మెసేజ్ వచ్చింది. కేవలం గూగుల్ మ్యాప్‌లో మేం సూచించిన రెస్టారెంట్‌లను సబ్‌స్క్రైబ్, లైక్ చేస్తే చాలు.. డబ్బులు మీ ఖాతాలో వేస్తాం, పార్ట్‌టైమ్ జాబ్ చేసి డబ్బులు సంపాదించాలి అనుకునేవారు కింద ఇచ్చిన లింక్‌ను ఓపెన్ చేసి, రిజిస్టర్ కావచ్చు అంటూ రాసి ఉంది. నిజమని నమ్మిన ఆమె వెంటనే లింక్‌ను క్లిక్ చేసింది. ఆ తర్వాత వారు చెప్పిన విధంగానే గూగుల్ మ్యాప్స్‌లో రెస్టారెంట్లకు లైక్‌లు కొట్టడం, రేటింగ్ ఇవ్వడం, వారు చెప్పిన యూట్యూబ్ చానల్స్ వీడియోలను చూసి సబ్‌స్క్రైబ్ చేశారు. అందుకు వారు ఆమె ఖాతాలో డబ్బులు వేశారు. ఇలా కొన్నిరోజులు నమ్మించిన నేరగాళ్లు ఆ తర్వాత మీరు ఆన్‌లైన్‌లో ఇన్వెస్టిమెంట్ చేస్తే ఆ డబ్బుతో తక్కువ సమయంలోనే అధిక లాభాలు సంపాదించవచ్చు అంటూ నమ్మించారు. పెద్ద మొత్తంలో లాభాలు వస్తున్నట్లు వర్చువల్‌గా చూపించారు. కానీ, డబ్బులు మాత్రం తిరిగి ఇవ్వడం లేదు. అప్పటికే బాధిత మహిళ రూ. 14.5 లక్షలు ఇన్వెస్టిమెంట్ చేసింది. అనుమానం వచ్చిన ఆమె సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.